www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 19 ఫిబ్రవరి 2024



ఉద్యోగుల వెన్ను విరిచిన ప్రభుత్వం

- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం
- ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల జేఏసీ హెచ్చరిక

ప్రజాశక్తి - పలమనేరు: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం ఉద్యోగుల వెన్ను విరిచిందని, తమ సమస్యలు తక్షణం పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి పిలుపు మేరకు పలమనేరు ఎన్జీవో హోం ఆవరణలో ఆదివారం ధర్నా నిర్వహించారు. తాలూకా ఏపీజేఏసీ ఛైర్మన్ కె ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులకు రావాల్సిన 25,500 కోట్ల బకాయిలు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేసి 12వ పిఆర్‌సి ప్రకటించాలని కోరారు. ఉద్యోగులు దాచుకున్న ఏపీజిఎల్ఐ, జిపిఎఫ్ సొమ్ములు కూడా తిరిగి చెల్లించడం లేదని వాపోయారు. జనరల్ సెక్రెటరీ సిపి ప్రకాష్ మాట్లాడుతూ సరెండర్ లీవులు చెల్లించకపోవడం దారుణమన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జివి రమణ మాట్లాడుతూ అప్రెంటిస్ విధానాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నం సరికాదన్నారు. హెల్త్ కార్డులు ఈ ప్రభుత్వ హయాంలో ఉపయోగం లేకుండా పోయాయన్నారు. ఎస్‌టియు నాయకులు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు ఇవ్వకపోవడం అనారోగ్య ఆర్థిక విధానాలకు నిదర్శనమన్నారు. ఎన్జీవో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి చాలా గర్హనీయమన్నారు. సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వ స్పందన శూన్యమని పేర్కొన్నారు. వాయిదాలు తప్ప ఫలితం లేదన్నారు. ఎన్జీవో సంఘం కార్యదర్శి జయమ్మ మాట్లాడుతూ ఏఎన్ఎం లను ప్రభుత్వం అనేక యాప్ లను ప్రవేశపెట్టి వేధిస్తోందన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘం నాయకులు వెంకటకృష్ణ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు అదనపు క్వాంటం ఆఫ్ పెన్షన్ తగ్గించడం దారుణం అన్నారు. తిరిగి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బకాయి పడ్డ పీఆర్సీ, డిఏ బకాయిలను వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులని సాధారణ ప్రభుత్వ ఉద్యోగులుగా చూడకుండా కొంతమంది అధికారులు అణచివేతకు గురి చేయడం సరికాదన్నారు. వేధింపులు ఆపి సహచర ఉద్యోగులుగా చూడడం నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు సుదర్శనాచారి మాట్లాడుతూ వారం రోజుల్లో సిపిఎస్ రద్దు అని మాట ఇచ్చి ఐదు సంవత్సరాలు కావస్తున్నా మాట తప్పడం సరికాదన్నారు. గ్రామ వార్డు సచివాలయం సంఘం జిల్లా అధ్యక్షులు రమణ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ జీవోని ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని కోరారు. పెన్షనర్ల సంఘం నాయకులు కృష్ణమూర్తి మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు గ్రాట్యూటీ కమిటేషన్ బిల్లులు చెల్లించకుండా బాండ్లను జారీ చేయడం దారుణమన్నారు. సిపిఎస్ సంఘం కన్వీనర్ శశి మాట్లాడుతూ ఉద్యోగులు మినహాయించిన 10 శాతం చందా ప్రభుత్వం వేయాల్సిన 10 శాతం చందా రెండూ ఉద్యోగుల ఖాతాలో జమ చేయక, ఆ నిధులు ఎక్కడికి మళ్లించారని ప్రశ్నించారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న బిఎల్ఓలు మాట్లాడుతూ నియోజక వర్గం లో అన్ని మండలాల నుండి బిఎల్ఓలు పలమనేరులో ఉన్న ఆర్డీఓ కార్యాలయానికి రోజూ హాజరు కావాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇందువల్ల తీవ్ర ఒత్తిడి, వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోందన్నారు. సంబంధిత తహశీల్దారు కార్యాలయంలో క్లెయిమ్‌లు అందజేయడానికి ఆర్డీఓ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈనెల 20వ తేదీ కలెక్టరేట్‌ల వద్ద ధర్నా, 27వ తేదీ 'చలో విజయవాడ'ను విజయవంతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో వినోద ఎంటీజీ ప్రసాద్, యాసిన్ షరీఫ్, మురళి, లక్ష్మీనారాయణ, నరసింహులు, నారాయణ, దేవా, పలువురు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల జేఏసీ నాయకులు

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- తిరుపతి సిటీ, వెదురుకుప్పం: పాలిటెక్నిక్ విద్యార్థిని హాస్టల్ గదిలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం వేణుగోపాల పురానికి చెందిన విద్యార్థిని టి శశి (17) పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతోంది. తిరుపతి నగరంలోని శ్రీవెంకటేశ్వర అగ్రికల్చర్ యూనివర్సిటీలోని ప్రియదర్శిని హాస్టల్లో మొదటి అంతస్తులో మరో ముగ్గురు స్నేహితురాళ్లతో కలిసి ఉంటోంది. ఇటీవల జరిగిన పరీక్షల్లో అన్ని సబ్జెక్టులలో ఫెయిల్ కావడంతో మనస్థాపానికి గురై గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అర్ధరాత్రి వరకు చదువుకున్న తోటి విద్యార్థులు ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో నిద్రలేచి చూడడంతో శశి ఫ్యాన్‌కి వేలాడుతూ కనిపించింది. వెంటనే విద్యార్థులు కేర్ టేకర్ కుమారికి సమాచారం ఇచ్చారు. హాస్టల్ సిబ్బంది ద్వారా విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ వి రమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి రూరల్ పోలీసులతో పాటు మహిళ ఎస్ఐ అరుణ సంఘటన స్థలానికి చేరుకుని మతదేహాన్ని పరిశీలించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థిని శశి

స్విమ్స్‌లో నిఘా నిల్..!

భద్రత పర్యవేక్షణ అంతంత మాత్రమే. .

ప్రజాశక్తి- తిరుపతి సిటి

రాష్ట్రంలో నెంబరవన్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌గా పేరుగడించిన స్విమ్స్ హాస్పిటల్‌లో నిఘా కళ్లు కరువయ్యాయి. దేశంలోనే మొదటిసారి సుదీర్ఘ విస్తరణలో మహిళలకు ప్రత్యేకంగా వైద్య కళాశాల ఉన్న ప్రాంతంలో, భద్రత పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉండడం శోచనీయం. టిటిడిలో విలీనం అయిన స్విమ్స్ తీరు మారకపోవడం గమనార్హం.

శ్రీవేంకటేశ్వర వైద్యవిజ్ఞాన సంస్థ (స్విమ్స్) 1200 పడకలకు పైగా సామర్థ్యంతో, రాష్ట్రంలోనే అన్ని రకాల సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలందిస్తున్న అతిపెద్ద ఆసుపత్రి. ప్రపంచాన్ని వణికించిన కరోనా మహ్మారి విజృంభించిన సమయంలో స్టేట్ కోవిడ్ ప్రధాన కేంద్రంగా సేవలందించిన స్విమ్స్, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రజలందరికి సుపరిచితమే. స్విమ్స్‌కు అనుబంధంగా దేశంలో ప్రప్రథమంగా మహిళల కోసమే శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాలను ఏర్పాటు చేశారు. అందులోనూ అన్ని రకాల సూపర్‌స్పెషాలిటీ వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్, పిజి కోర్సులకు శిక్షణ తీసుకుంటూ వందలామంది మహిళా విద్యార్థినులు ఉంటున్నారు. దీనికి తోడు స్విమ్స్ నర్సింగ్ కళాశాల, పారామెడికల్ కళాశాల, ఫిజియోథెరపి కళాశాలతో కలిపి వేలాది మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. స్విమ్స్, శ్రీపద్మావతి మహిళా వైద్యకళాశాల ఆసుపత్రికి కలిపి ప్రతి రోజు 2వేల మందికిపైగా రోగులు ఓపి సేవల నిమిత్తం వస్తుంటారు. ప్రతి రోజు 300కిపైగా ఇన్‌ఫేషెంట్లను చేర్చుకుంటారు. రోగులు, రోగి సహాయకులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సులు, పారామెడిల్ సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, ఇతరాత్ర వైద్య సిబ్బంది, స్విమ్స్ యూనివర్సిటీ సిబ్బంది, అందులో చదువుకునే అన్ని రకాల వైద్య విద్యార్థులు కలిపి నిత్యం 10వేల మంది వరకు అక్కడ ఉంటున్నారు. వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రారు, డీన్లు, ఓ ఐఏఎస్ అధికారి పర్యవేక్షణ, డిప్యూటీ డైరెక్టరు, ఎంఎస్, జిఎం, పిఎం, ఏడిలు ఇలా అనేక మంది ఉన్నతాధికారులు అక్కడ విధులు నిర్వహిస్తుంటారు. ఇంత ప్రాముఖ్యత కల్గిన ఈ ప్రాంతంలో నిఘా కళ్లు కరువయ్యాయి. వందల ఏకరాల విస్తర్ణం కల్గిన ప్రదేశంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తే ఒట్టు. ఆసుపత్రి లోపల కొన్ని వార్డుల్లో సిసి కెమెరాలు ఉన్నా అవి పనిచేసిన దాఖలాలు లేవు. ఆసుపత్రి వెలుపల, పరిపాలన భవనం వద్ద, క్యాజువాలిటీ, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల, మూడు పార్కింగ్ స్థలాలు, రెండు క్యాంటీన్లు, మూడు మెడికల్ షాపులు, ఎస్‌బిఐ బ్రాంచ్, రక్తనిధి, మార్చురీ, దోబీఘాట్, జనరేటర్, గ్యాస్‌నిల్వ కేంద్రాలు, ఓపి విభాగం, సిద్ద క్లీనిక్, ఒకటంటే ఒక చోట కూడా సిసి కెమెరాలు ఏర్పాటు ఆలోచనే చేయకపోవడం గమనార్హం. స్విమ్స్ వద్ద సిసి నిఘా లేకపోవడంతో దొంగలకు ఆ ప్రాంతం అడ్డాగా మారుతోంది. బయట ప్రాంతం నుంచి చోరీ చేసిన ద్విచ్వక్ర, ఇతరాత్ర వాహనాలు దొంగలు స్విమ్స్ వద్ద పార్కు చేసి వెళ్లి, మరుసటి రోజు పోలీసులు కళ్లుగప్పి తాపీగా తీసుకెళ్లుతున్న సంఘటన నిత్యం కోకొల్లాలు. ఆసుపత్రికి, ఓపికి, ఐపికి, మహిళా వైద్యకళాశాలకు ఎవ్వరు వస్తున్నారు, ఎవ్వరు పోతున్నారో కూడా అర్థం కాని పరిస్థితి. ఇది సరైనది కాదు, సిసి కెమెరాలను తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు అనేక సార్లు ప్రతిపాదనలు చేసినా పెడిచెవిన పెట్టడం శోచనీయం. స్విమ్స్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి టిటిడిలోకి విలీనం అయినా తీరు మారకపోవడం గమనార్హం.

చిత్తూరు టికెట్ గురజాలకే..?



ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అధికార పార్టీ వైసిపి చిత్తూరు నియోజకవర్గ బరిలో దింపిన ఎంసీ విజయానందరెడ్డికి ధీటైన వ్యక్తిగా గురజాల జగన్మోహన్‌ను టిడిపి అభ్యర్థిగా ఖరారు చేయనున్నట్లు టిడిపి నేతలు భావిస్తున్నారు. గురజాల జగన్మోహన్ అభ్యర్థిత్వం దాదాపు ఖరారు అయినట్లేనని చెబుతున్నారు. చిత్తూరు నియోజక వర్గంలో గురజాల జగన్మోహన్ సేవా కార్యక్రమాలతో లేదా బడుగు, బలహీన వర్గాలకు చేరువ కావడంతో పాటు జిల్లా కేంద్రమైన చిత్తూరులో పసుపు జెండా రెపరెపలాడింది. టిడిపిలో అప్పటి వరకు ఓ రకంగాను, గురజాల జగన్మోహన్ అడుగుపెట్టాక మరో విధంగా మారిపోయింది. చిత్తూరు నియోజకవర్గం చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల మండలాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, టిడిపి అనుబంధ సంఘాల్లో నూతన ఉత్సాహం, ఉత్తేజాన్ని కలిగించారు. అప్పటివరకు నగరంలో అధికార పార్టీ నేతల ఫ్లెక్సీలు, బ్యానర్లు, భారీ కటౌట్ల స్థానంలో ప్రతిపక్ష టిడిపి ముఖ్య నేతల ఫ్లెక్సీలు, బేనర్లు, కటౌట్లు గోడ పత్రికలు వెలిశాయి. గురజాల జగన్మోహన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం అనేక సేవా కార్యక్రమాలను అనతి కాలంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి చిత్తూరు నియోజకవర్గ ప్రజల గుండెల్లో ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. చిత్తూరు టికెట్ గురజాలకు ఖరారు అయిన వెంటనే అధికార పార్టీ నుండి ద్వితీయ శ్రేణి నాయకత్వం, కొందరు కార్పొరేటర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు టిడిపి కండువాలు కప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గ నాయకులు కార్యకర్తలలో గురజాల జగన్మోహన్ టిడిపి ఆశయాలను ముందుకు తీసుకు పోయేలా ఆత్మవిశ్వాసాన్ని నింపారనడంలో ఎలాంటి సందేహం లేదు. మరోవైపు జనసేన నాయకత్వం గురజాల జగన్మోహన్ అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ గురజాల జగన్మోహన్ అయితేనే చిత్తూరులో విజయ అవకాశాలు ఉంటాయని బలంగా భావిస్తున్నట్లు సమాచారం. గురజాల జగన్మోహన్ చిత్తూరు నుండి పోటీ చేస్తే గుడిపాల సొంత మండలం కావడం కలిసొస్తుందని టిడిపి కంచుకోటగా ఉన్న గుడిపాల మండలం తిరిగి ఆ పార్టీ కంచుకోటగా మారే అవకాశం ఉంది. గుడిపాల మండలానికి చెందిన గురజాల జగన్మోహన్ నాయుడు ఇటీవల కాలంలో క్రియాశీలకమయ్యారు. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలన్నీ ఆయన ఆధ్వర్యంలోని జరుగుతున్నాయి. పేదలకు నాలుగు చక్రాల బండ్లను పంచడం, నిత్యావసర వస్తువులు పంచడం తదితర కార్యక్రమాలతో జగన్ మోహన్ నాయుడు ప్రజల్లోకి వెళుతున్నారు. దాన ధర్మాలు కూడా చేస్తున్నారు. యువగళం ముగింపు యాత్రకు కూడా ఆయన 40 లక్ష రూపాయల వ్యయంతో ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు ఆధ్వర్యంలో టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులందరూ చిత్తూరు పట్టణంలో ఇంటింటికి తిరిగి తిగిరి తమ పార్టీనే గెలిపించాలని ఇప్పటికే ప్రచారం చేస్తున్నారు.

గమ్యం'అగమ్య గోచరం'

- కాలం చెల్లిన ఆర్‌టిసి బస్‌లు
- మధ్యలోనే ఆగిపోతున్న వైనం
- ప్రయాణికుల బెంబేలు



మరమ్మతుకు గురై మార్గ మధ్యంలోనే ఆగిన బస్సు

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సులలో ప్రయాణం అగమ్య గోచరంగా మారింది. పలమనేరు ఆర్‌టిసి డిపోకు చెందిన బస్సులు ఎక్కడ పడితే అక్కడ అనేక సార్లు ఆగిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. దీనికి ఉదాహరణ శనివారం కుప్పం మార్గంలో ప్రయాణిస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు గొల్లపల్లి వద్ద మరో సారి మరమ్మతుకు గురై ఆగిపోయింది. అర్జెంటుగా గమ్యస్థానం వెళ్లాల్సిన ప్రయాణికులు తర్వాత బస్సులో వెళ్దాం అనుకుంటే దాదాపు గంటకు పైగా ఆ మార్గంలో బస్సు ఏది రాలేదు. కారణమేమంటే బస్సులన్నీ అనంతపూరు జగన్ ప్రోగ్రాం కు పంపించారు. దీంతో ప్రయాణికులు, విద్యార్థులు , అనారోగ్యానికి గురైన వ్యక్తులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు లేకపోతే ఆర్టీసీ ఆదాయం ఎలా వస్తుందనే విషయాన్ని సిబ్బంది గుర్తించడం లేదు. అంతేకాకుండా ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారు. రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సు నడిపే డ్రైవర్లు అతివేగంగా వెళుతున్నారు. ఇలా డ్రైవ్ చేయడం వల్ల బస్సులు మరమ్మతులకు గురవుతున్నాయా? లేక కాలం చెల్లిన బస్సుల వల్ల ఇలా జరుగుతోందా? అనే సందేహం లేకపోలేదు. వెంటనే అధికారులు స్పందించి, ప్రయాణికులకు,తగిన సౌకర్యం కల్పించి వారిని గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాల్సిన బాధ్యత వుంది.


నగరికి పర్యాటక 'శోభ'

- మంత్రి రోజా చొరవతో మంజూరైన శిల్పారామం
- మండలంలోని తడుకు వద్ద పూర్తయిన భూసేకరణ
- నియోజకవర్గ అభివృద్ధి పెంపు

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: నగరికి పర్యాటక రంగానికి శోభ చేకూరనుంది. ఇప్పటికే ప్రమాణాలు పెంచుకుంటూ అభివృద్ధి పథంలో నడుస్తున్న నగరి నియోజకవర్గానికి 'శిల్పారామం' రూపంలో అదనపు అందం చేకూరనుంది. పర్యాటక శాఖ మంత్రి ఆర్కేరోజా సూచనల మేరకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఏపీ శిల్పారామం సొసైటీ, విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్‌కు అందిన లేఖ అందడంతో ఆయన భూముల కేటాయించేందుకు భూసేకరణ చేయాలంటూ ఆర్డీవోకు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు నగరి మండలం తడుకు గ్రామంలోని సర్వే నెంబరు 92/1,2, 93/3, 94/2,3, 95/3,4 లోని 12 ఎకరాల స్థలాన్ని 'శిల్పారామం' ఏర్పాటుకు కేటాయించారు. భూముల కేటాయింపు పూర్తికావడంతో ఏపీ శిల్పారామం సొసైటీ వారు త్వరగా నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 8 శిల్పారామంలు ఉండగా కొత్తగా ఐదు శిల్పారామంలను ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇలా నగరిలో ఒక శిల్పారామం ఏర్పాటు కానుంది. ఇప్పటికే నియోజక వర్గంలో నాలుగు పార్కు లు ఏర్పాటైన విషయం విదితమే.. ఇవి స్థానికులకు ఆహ్లాదాన్ని పంచుతుండగా నూతనంగా ఏర్పాటు కానున్న శిల్పారామం పర్యాటక సింగారాన్ని చేకూర్చనుంది. మన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధిత కళాఖండాలు, శిలల పార్కు, పచ్చికబయళ్లు, తోటలు, రాక్ గార్డెన్, కలంకారీ వస్తువులు, బోటింగ్, పార్కు, చేనేత దుస్తులు, పింగాణి వస్తువుల అమ్మకాలు, పురాతన వస్తువుల ప్రదర్శన అంటూ శిల్పారామం నగరి ప్రజలను అలరించనుంది. చేతివృత్తి ద్వారా వస్తువులు తయారుచేసే వారికి శిల్పారామం వరప్రదాయని కానుంది.



శిల్పారామం ఏర్పాటుకు ఎంపిక చేసిన ప్రదేశం



వైసిపి, టిడిపి నుంచి రాజమండ్రి ఎంపీగా ఆఫర్

ప్రజలకు మేలు చేసే మేనిఫెస్టోకే నా మద్దతు: సినీనటుడు సుమన్ వెల్లడి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

వైసిపి, టిడిపి పార్టీల నుంచి రానున్న ఎన్నికల్లో రాజమండ్రి ఎంపీగా పోటీ చేయాలని ఆఫర్లు వచ్చినట్లు సినీ నటుడు సుమన్ వెల్లడించారు. ఆదివారం తిరుపతి తాతయ్యగుంట గంగమ్మను సుమన్ దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో ఇటు టిడిపి అటు వైసిపిల నుంచి తనను పోటీ చేయాలని ఆఫర్ వచ్చినట్లు తెలిపారు. తన రాజకీయ గురువు చంద్రబాబు అని చెప్పారు. అయితే తాను రాష్ట్ర విభజన అనంతరం హైదరాబాదులో ఉండిపోవడం వల్ల ఆంధ్రరాష్ట్రంలో పోటీ చేయడానికి అంత ఆసక్తిగా లేదని చెప్పారు. ఆంధ్రరాష్ట్రంలో పోటీ చేయాలంటే తాను మూడు రోజులు ఆంధ్రాలో నాలుగు రోజులు తెలంగాణలో ఉండలేనని పేర్కొన్నారు. సంవత్సరం ముందు పోటీ చేయాలని తనకు రెండు రాజకీయ పార్టీలు పిలిచి ఉంటే వచ్చి ఉండేవాడిని చెప్పారు, ఇప్పుడు వచ్చి పోటీ చేయాలంటే తనకు ఆసక్తి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు మేలు చేసే మేనిఫెస్టోకే తన మద్దతు ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులకు, యువత, మహిళలు, రైతులకు మేలు చేసే మేనిఫెస్టో ఉండాలని కోరారు. చాలావరకు ఎన్నికల్లో మేనిఫెస్టో రూపొందించిన పార్టీలు వాటిని సాధ్యాసాధ్యాలు పరిశీలించకుండా హామీలు ఇవ్వడం తగదన్నారు. ముఖ్యంగా వైద్యంలో, పెన్షన్లు సౌకర్యం, ఇతర సదుపాయాల్లో వృద్ధులకు ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడకుండా వారిని కట్టడి చేసేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. యువతకు ఉపాధి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గంగమ్మ ఆలయంలో సినీ నటుడు సుమన్‌కు ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

వ్యవసాయ అభివృద్ధికే సలహా మండలి ఏర్పాటు

రామచంద్రారెడ్డి
జిల్లా వ్యవసాయ
సలహా మండలి ఛైర్మన్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేస్తూ రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సలహా మండలిని ఏర్పాటు చేసింది. జిల్లా సలహా మండలి లో జిల్లాస్థాయి వ్యవసాయ అనుబంధ అధికారులు, రైతు సంఘాలు, అనుభవం కలిగిన రైతులు సభ్యులుగా ఉన్నారు. ప్రతి రెండు, మూడు నెలలకోసారి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించి జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలు, రైతాంగానికి అందించిన సేవలను చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించనున్నారు. జిల్లా రైతాంగానికి ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం అందించాలో సమావేశంలో తీర్మానించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్రారెడ్డి వివరించారు. 'ప్రజాశక్తి' నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

ప్రశ్న: జిల్లా వ్యవసాయ సలహా మండలి ఉద్దేశం ఏమిటి?


సమాధానం: జిల్లాలోని రైతాంగానికి అండగా ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా సహాయ, సలహాలు సూచనలు అందించడం వ్యవసాయ సలహా మండలి ఉద్దేశం. జిల్లాలో రైతాంగం ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం..

ప్రశ్న: ఇప్పటి వరకు వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సమస్యలు విన్నవించింది?

సమాధానం: గత ఏడాది జిల్లాలో వేరుశనగ రైతులు తీవ్రంగా నష్టపోయింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం..డిసెంబరులో కేంద్ర బృందాలు, జిల్లాలో పర్యటించి కరువు పరిస్థితులను అంచనా వేశాయి. కేంద్ర బృందం నివేదిక మేరకు కరువు సాయం అందాల్సి ఉంది.

ప్రశ్న: ప్రకృతి వ్యవసాయం జిల్లాలో ఎలా జరుగుతోంది?

సమాధానం: ప్రకృతి వ్యవసాయం పూర్తి గా సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా పండిస్తున్న పంటలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది. అనేక మంది రైతులు సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్నారు. రానున్న రోజుల్లో సేంద్రీయ వ్యవసాయం సాగు విస్తరణ పెరిగే అవకాశాలు బాగా ఉన్నాయి.



రామచంద్రారెడ్డి,
జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్

ప్రశ్న: ఆర్‌బికెల ద్వారా రైతాంగానికి ఎలాంటి సేవలు అందిస్తున్నారు?

సమాధానం: వ్యవసాయ రంగాన్ని నిరంతరం పర్యవేక్షణతో పాటు క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు, ఆర్‌బికెల ద్వారా పంటకు కావలసిన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు సరఫరా చేస్తున్నారు.

ప్రశ్న: మామిడి రైతులకు ఎలాంటి ప్రోత్సాహం అందిస్తున్నారు?

సమాధానం: జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటగా మామిడిని సాగు చేస్తున్నారు. జిల్లాలోని మామిడికి అధిక ధరలు వచ్చేలా చేయడానికి క్షేత్ర స్థాయిలో రైతులతో అవగాహన సదస్సులు నిర్వహించారు. మామిడి రైతులకు పూర్తి స్థాయిలో ఉద్యాన శాఖ ద్వారా చీడపీడలు నివారించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.. మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మామిడి రైతులకు మంచి ధర వచ్చేలా కృషి చేస్తాం. ఏడాది పూత ఆలస్యమైనప్పటికీ దిగుబడి పెరిగే అవకాశం వుందని ఉద్యానవన శాఖ అంచనా వేస్తోంది. జిల్లాలోని పశు సంపదకు 95 శాతం వ్యాక్సినేషన్ పూర్తి అయిందని, మేకలు గొర్రెలకు కూడా 75 శాతం వ్యాక్సినేషన్ పూర్తి అయిందని, పశువులకు సంబంధించిన అంబులెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా సేవలు అందిస్తున్నాం.



మామిడి పూతను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు

నగరి సిగలో మరో మణిహారం

- ఎంవిఐ కార్యాలయం మంజూరు
- తీరిన నగరి ప్రజల కోరిక

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: నగరి పట్టణం ప్రమాణాలు పెంచడంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ప్రజలకు మంచి చేయాలన్న తపన, దాన్ని సఫలీకృతం చేయాలన్న దృఢసంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చని ఆమె నిరూపిస్తున్నారు. జిల్లా విభజనలో నగరి, విజయపురం, నింద్ర మండలాలు చిత్తూరు జిల్లాకు పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాకు చేరిపోయాయి. దీంతో నియోజకవర్గ అభివృద్ధి రెండు జిల్లాల పరంగా చేపట్టాల్సిన పరిస్థితి ఎదురైనా అన్ని మండలాలను సమర్థవంతంగా అభివృద్ధి చేయడంలో మంత్రి సక్సెస్ అయ్యారు. నగరిని డివిజన్ కేంద్రంగా చేయడంతో నగరిలోనే ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం ఇప్పటికే ఏర్పాటయ్యాయి. దీంతో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన వారు చిత్తూరుకు వెళ్లే పరిస్థితి లేకుండా భూములకు సంబంధిత వ్యవహారాలకు నగరిలోని ఆర్డీవో కార్యాలయంలోనే పరిష్కరించుకునే వసతి కల్పించారు. మరోవైపు పుత్తూరులోనూ డీఎస్పీ కార్యాలయాన్ని కొనసాగించారు. అయితే పుత్తూరులోని ఎంవిఐ కార్యాలయం తిరుపతి జిల్లాకు చేరిపోవంతో నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన వారు వాహనాలకు లైసెన్స్ తీసుకోవాలంటే చిత్తూరుకు వెళ్లాల్సి వచ్చింది. ఇది వారికి చాలా కష్టతరంగా మారింది. దీంతో వారు మంత్రి ఆర్కేరోజాకు తమ సమస్యను విన్నవించుకున్నారు. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి మంత్రి ఆర్కేరోజా తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం సమర్పించారు. మంత్రి విన్నపానికి ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో నగరి పట్టణానికి మోటర్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం మంజూరైంది. ఈ మేరకు ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రద్యుమ్న నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఆరు మండలాలకు ప్రయోజనం

నగరితో పాటు నింద్ర, విజయపురం, కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం మండలాల్లోని వారికి ప్రయోజనం కలిగించేలా నగరి పట్టణంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ప్రారంభం కానుంది. ఇక లైసెన్సులు తీసుకోవాలనుకున్న వారు చిత్తూరుకు వెళ్లాల్సిన అవసరం లేదు. అందుబాటులో నగరిలోనే లైసెన్సులు, వెహికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందవచ్చు.



ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి రోజా

అడిగిన వెంటనే మంజూరు

ప్రజల సౌకర్యార్థం అడిగిన ప్రతి పని జగనన్న చేస్తుండడంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయగలుగుతున్నానని మంత్రి ఆర్కేరోజా అన్నారు. నియోజకవర్గ ప్రమాణాలు పెంచేలా నగరిలో ఆర్డీవో కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం, ఎంవిఐ కార్యాలయం తెప్పించగలిగానన్నారు. పుత్తూరులోని డీఎస్పీ కార్యాలయాన్ని, ఎంవిఐ కార్యాలయాన్ని అలాగే కొనసాగించగలిగామన్నారు.

మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వీరభద్ర స్వామికి ఏటా నిర్వహించే మైలారు పండుగ సందర్భంగా స్థానిక మిట్టూరు లోని గంగినేని చెరువు వద్ద ఆదివారం స్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజలలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు పాల్గొన్నారు. రజక సంఘం పెద్దలు సీకే బాబుకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున రజకులు, సీకే బాబు అభిమానులు, అనుచరులు పాల్గొన్నారు.

బలిజ సంఘం అధ్యక్షులుగా రామదాసు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు బలిజ సంఘం సమావేశం స్థానిక మార్కెట్ చౌక్‌లో బలిజ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆర్ అండ్ శ్రీనివాసులు పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో బలిజలకే ఎమ్మెల్యే సీటు కేటాయించాలని ఆ సంఘం నాయకులు ప్రతిపాదించారు. అధ్యక్షులుగా ఒ.ఎం రాందాస్, జనరల్ సెక్రటరీ, కార్యదర్శులుగా ఎన్నికైన రెడ్డప్ప, కోలా కిరణ్, విశ్వనాథ్, కిషోర్‌లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు డి.కె.బద్రీనారాయణ, ఎస్ఎమ్‌సోహర్, కాజూర్ బాలాజీ, వినాయక బాలాజీ, కుప్పంపల్లి బాలాజీ బలిజ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుండ్రం దళితవాడ చర్చివద్ద సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని సిఎస్ ఐ చర్చి పాస్టర్ దేవేంద్రన్, సబామనేజర్ జీవరత్నం తెలిపారు. తమిళనాడు చెన్నై కి చెందిన ఎంఎన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో తూగుండ్రం సిఎస్ఐ చర్చి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. గతంలో కంటి ఆపరేషన్ చేసుకున్న రోగులు సైతం తప్పనిసరిగా కంటి పరీక్షలు చేసుకోవాలని పిలుపు నిచ్చారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - పలమనేరు: పలమనేరు పట్టణంలోని పాతపేటలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఆదివారం ఇంటింటికి టిడిపి కార్యకర్తలతో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపో ఎదురుగానే ఉన్న ఓఎల్ఎల్ యూపీ స్కూల్ క్రాస్, మార్కెట్ కమిటీ ఏరియా, ఆర్.కే. స్ట్రీట్, లక్ష్మీ నగర్, కే.వి.ఎస్ స్ట్రీట్, మసీద్ స్ట్రీట్ లలో ఆయన పర్యటన సాగించింది. ఈ సందర్భంగా లక్ష్మీ నగర్ కాలనీ వద్ద ఆయన పార్టీ జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. గత నాలుగున్నరేళ్లలో జగన్ తీసుకున్న నిర్ణయాలు, వైసిపి నేతల అక్రమాలు, దౌర్జన్యాలతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలలో, ఉద్యోగస్తులలో జగన్ ప్రభుత్వం పై పూర్తి అసంతృప్తి నెలకొందని ఏ ఒక్కరూ సంతోషంగా లేరని తెలిపారు. బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందని వచ్చే ఎన్నికలలో బాబు నాయకత్వాన్ని బలపరిచేందుకు అన్ని వర్గాలతో పాటు ప్రధానంగా యువత ఉవ్విళ్లూరుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుట్టి, గిరిబాబు, చాంద్‌బాషా, సుబ్రమణ్యం గౌడ్, భాజాపీర్ పాల్గొన్నారు.

65 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి వైద్య బృందం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 65మంది పరీక్షలు చేయించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం పాకాలలో ఏర్పాటు చేసిన శిబిరంలో 15మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. వారికి సోమవారం చెన్నైలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జయరామనాయుడు, కుప్పస్వామి నాయుడు, అనిల్ కుమార్, దొరస్వామి, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాతృత్వం

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటకు చెందిన విద్యార్థి పద్మప్రియ బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువు తోంది. ఆర్థిక పరిస్థితి బాగోలేక ల్యాప్‌ట్యాప్ కావాలని గడపగ డపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే బియ్యపు మధు సుదన్‌రెడ్డిని విద్యార్థి పద్మప్రియ కోరారు. వెంటనే ఎమ్మెల్యే ఆ విద్యార్థి ల్యాప్‌టాప్ అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.

బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలోని ఎంపీ యూపీ పాఠశాలలో నెహ్రూ యువ కేంద్రం, యువనేస్తం అసో సియేష్ సంయుక్తంగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజే తలకు అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్ బహుమతులు ప్రదానం చేశారు.

టీడీపీతోనే అభివృద్ధి: మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గూడూరుటౌన్: టీడీపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరులో టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీపై నమ్మకంతో అనేక మంది పార్టీలోకి వస్తున్నారని, వారందరికీ స్వాగతం పలుకు తున్నట్లు చెప్పారు. ఏ సమస్య వచ్చినా వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, చెంచురామయ్య, వెంకటేశ్వరరెడ్డి, లీలావతి, రహీం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గూడూరుటౌన్: ప్రయోజకులైన పూర్వ విద్యార్థులు వారు చదివిన విద్యా సంసథ అభివృద్ధికి తోడ్పాటు అందిం చాలని అల్యూమినియం అసోసియేషన్ జి.ఐ.సి.టి అధ్యక్షుడు చంద్రమోహన్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ సిరామిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తాము చదువుకున్న అభివృద్ధికి శక్తి మేర మా అసోసియేషన్ ఆధ్వర్యంలో సహాయం చేయడం జరిగిందని, భవిష్యత్తులో కూడా కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణరావు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ సుబ్బారావు, అసోసియేషన్ సెక్రెటరీ సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, పాండు, నరసింహులు, అరుణ్‌కుమార్, రామకృష్ణా, వెంకటేష్, విజయలక్ష్మి, జాలేంద్ర పాల్గొన్నారు.

ఓటుకు నోటు వద్దే వద్దు..

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని కొత్త వీరాపురం అగ్రహారంలో శ్రీకాళహస్తి ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి, యువ సమాజ్ నిర్మాణ సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ఓటుకు నోటు వద్దే వద్దు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు.

'నిరంతరం హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవలు నిరంతరం కొనసాగుతాయని ఆ సంస్థ నిర్వాహకుడు మునీర్ బాషా తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 146వ నెల ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. గత 146 నెలలుగా తమ సంస్థ పట్టణంలోని పేదవారికి, ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని మునీర్ తెలిపారు. మరికొందరు పేదలకు ఆర్థిక సాయం కూడా అందజేస్తూ తమ వంతు సమాజ సేవ చేస్తున్నామనీ, భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సంస్థ సభ్యులు శ్రావణి, బాబా తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బస్తాలు అందజేత

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని ఆమండూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కావమ్మ మారయ్య గుడి నిర్మాణానికి శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరికి చెందిన జె.కె స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాథం నాయుడు 30బస్తాల సిమెంటును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో రాజు, మురగయ్య, మునిరాజా పాల్గొన్నారు.

వైసీపీ చంద్రగిరి కన్వీనర్‌గా మస్తాన్

ప్రజాశక్తి-రామచంద్రపురం(చంద్రగిరి): వైసీపీ చంద్రగిరి కన్వీనర్‌గా మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ మస్తాన్‌ను నియమించారు. ఈ మేరకు తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆలయంలో లీకేజీల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పులో ఏర్పడ్డ లీకేజీలను అరికట్టేందుకు పూణేకి చెందిన ఉత్తరా దేవి చారిటబుల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ చర్యలు చేపట్టింది. రూ.4 కోట్ల వ్యయంతో లీకేజీలను అరికట్టడానికి ఆ సంస్థ అధినేత వెంకటేశ్వరరావు ముందుకు వచ్చారు. ఆదివారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. పురాతనమైన దేవాలయాలు కాపాడే పద్ధతిలో కాంక్రీట్ వ్యవస్థ కాకుండా స్ఫటిక బెల్లం, గళ్ళ సున్నము, కరక్కాయ, శురికి, మెత్తటి ఇసుక కలిపిన మిశ్రమంతో లీకేజీలను అరికట్టే పనులు చేస్తున్నారు. లీకేజీలు అరికట్టగలిగితే మరో వందేళ్లు లీకేజీల సమస్య ఉండదని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు ఎదగాలి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: విద్యార్థి దశ నుండి క్రమశిక్షణ, అంకిత భావం అలవర్చుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని హార్వాడ్ స్కూలు కరస్పాండెంట్ భాస్కర్ సూచించారు. స్థానిక రామ్ నగర్ కాలనీలోని మార్వాడి ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థి దశ అత్యంత కీలకమని ఈ దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని తెలిపారు. నేటి యువత చేతుల్లో దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఎలాంటి చెడు మార్గాల వైపు ఆకర్షితులు కాకుండా దేశం గర్వించే భావి పౌరులుగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



హార్వర్డ్ స్కూల్ ఫేర్వెల్ ఫంక్షన్‌లో మాట్లాడుతున్న కరస్పాండెంట్ భాస్కర్

షార్ట్ సర్క్యూట్‌తో చెరుకు తోట దగ్ధం

లక్షల్లో ఆస్తి నష్టం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని బాలుపల్లెకు చెందిన ఇద్దరి రైతులకు చెందిన చెరకు తోట ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా కాలిపోయింది. గ్రామస్తులు ఆదివారం మాట్లాడుతూ మండలంలోని తిరుమలయ్య పల్లి పంచాయతీ, బాలుపల్లి గ్రామానికి చెందిన ఎం జగన్నాథరెడ్డి, ఎం నాగిరెడ్డి చెరుకు పంట కాలిపోయింది. సంవత్సరం పొడవునా ఎంతో కష్టపడి పెంచి చేతికి అందే సమయంలో ఇలా కాలిపోవడంతో ఆ రైతులు ఏమి చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఆశలన్నీ ఆ పంట పై పెట్టుకున్నారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయి సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన చెరకు తోట

కాంగ్రెస్‌లో చేరాలని సీకే బాబుకు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యేతో చర్చిస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: మాజీ శాసనసభ్యులు సి కె బాబు ని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పోటిగారి భాస్కర్, పార్లమెంటు ఇన్‌ఛార్జి రాం భూపాల్ రెడ్డి, నలుగురు కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆదివారం స్థానిక కట్టమంచి లోని సీకే బాబు నివాసంలో కలసి కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రావూరి పూర్ణచంద్రరావు , వరదరాజులన్న, అక్బర్ , మహిళా అధ్యక్షురాలు చందు, రాణి యాదవ్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

'జనసేనతోనే రాష్ట్రానికి భవిష్యత్తు'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ వినుత కోట అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జనసేన పార్టీని ఆదరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రసాద్, గణేష్, అఖిల్ సాయి, సుబ్బు, మునీంద్ర, రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-ఏర్పేడు: మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెన్నంపల్లి బాలాజీ కుటుంబానికి రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డా.సిపాయి సుబ్రమణ్యం ఆదివారం పరామర్శించారు. బాలాజీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సిపాయి భరోసా కింద 40 నిత్యావసర సరుకులు అందించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, మధురెడ్డి, జనార్ధన్‌రెడ్డి, దేశిరెడ్డి, అంకిరెడ్డి, రఘునాథరెడ్డి, చంద్రరెడ్డి, శివరెడ్డి, సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ గెలుపునకు కృషి చేద్దాం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-గూడూరుటౌన్: వైసీపీని గెలిపించుకొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. ఆదివారం మండలంలోని కామాక్షి నగర్ ప్రాంతంలో ఉన్నా ముత్తుమారి అమ్మన్ కల్యాణ మండపంలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో గోపాల్‌రెడ్డి, దేవసేనమ్మ, విజయకుమార్ రెడ్డి, విజయమోహన్ రెడ్డి, మీరారెడ్డి, కల్పలత, నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. వానరం!

ప్రజాశక్తి-వెంకటగిరి రూరల్: పట్టణంలోని 25వ వార్డు ప్రజలు ఇంట్లో నుండి బయట రావాలంటే భయపడుతున్నారు. మున్సిపాలిటీలోని కాంపాలెంలో గత నెల రోజుల నుండి ఓ వానరం పెద్ద చిన్న తేడా లేకుండా మనిషి కనిపిస్తే చాలు పైకి దూకి కరుస్తుండడంతో అవార్డు ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

కాణిపాకంలో కళాకారుల సందడి

సమస్యలు పరిష్కరిస్తామని ఆలయ ఏఈఓ హామీ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వద్దకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న వేలాది మంది కళాకారులు పిల్లన గ్రోవులు, తాళం భజన, కోలాట చెక్కభజన, కులుకు భజన, నామ సంకీర్తన భజనలతో అగరంపల్లి క్రాస్ నుంచి వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం మాడవీధులలో ప్రదర్శన చేస్తూ స్వామికి కళా నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆస్థాన మండపంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బంగారు మురళి సభా అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర స్వామి హాజరయ్యారు. విజయ శంకర స్వామి మాట్లా డుతూ స్వామి చెంత నిత్య భజనలను ప్రారంభించాలని నిత్య నామ సంకీర్తన జరపాలనే కళాకారుల మనోవాంఛను దేవస్థానం మన్నించి వెంటనే వేదికను ఏర్పాటు చేసి తగిన సౌకర్యం కల్పించాలని కోరారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏ జగన్మోహన్ రావు మాట్లాడుతూ కళాకారులు కాణిపాక దేవస్థానంలో నిత్య భజనలకు వేదిక ఏర్పాటు చేయాలని కోరుకున్నా దేవస్థానం వారు పట్టించుకోకపోవడం బాధాకరమని. కళాకారుల కోరికలు మన్నించాలని తెలిపారు. జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు మురళి మాట్లాడుతూ అన్ని దేవాలయాలలో నిరంతర నామ సంకీర్తనలు జరుగుతున్నా. కాణిపాక దేవస్థానంలో భజనలు జరగకపోవడం బాధాకరమని గతంలో నిరంతరంగా కొనసాగుతున్న కళా ప్రదర్శనలు ఆపివేసి మళ్లీ కొనసాగించకపోవడం సమంజసం కాదని తెలిపారు. కళాకారులకు నిత్య భజనలకు ఒక వేదిక కూచిపూడి భరతనాట్యం హరికథ కోలాట చెక్కభజన, పండరి భజన, పిల్లనగ్రోవులు, కులుకు భజన లాంటి కళాకారులకు మరో వేదిక ఏర్పాటు చేసి అవకాశాలు ఇవ్వాలని కోరారు. ఆలయ ఏఈ ఓ మాధవ రెడ్డి మాట్లాడుతూ కళాకారులు కోరిన ఈ విషయాలను ఛైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళ్లి చర్చించి త్వరలోనే భజనలు ప్రారంభమయ్యేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిత్తూరు జిల్లా అధ్యక్షులు కేఎస్ రామచంద్రన్ మాట్లాడుతూ కళాకారుల పట్ల దేవస్థాన అధికారుల నిర్లక్ష్య ధోరణి తగదని స్వామి సేవలో పాల్గొని అందరం సమన్వయమై ఐకమత్యంగా స్వామి వైభవాన్ని నలుమూలలా చాటి చెప్పేందుకు నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు నాగరాజు, చిత్తూరు జిల్లా కార్యదర్శి రవికుమార్, చిత్తూరు జిల్లా కోశాధికారి రాజేంద్ర నాయుడు, జిల్లా నాయకులు సునీతమ్మ, రాజేంద్ర , భువనేశ్వరమ్మ, సుందర్ రాజన్న, గురువులు మని విక్రమ్, సుందరయ్య, నాగభూషణమ్మ, వరదరాజులు, జిల్లా వ్యాప్తంగా భజన బృందం లీడర్లు, గురువులు, కళాకారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కాణిపాకంలో ప్రదర్శనలు నిర్వహిస్తున్న కళాకారులు

పార్టీ కార్యక్రమానికి బలవంతంగా విద్యాసంస్థల బస్సులు

టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు ప్రభు తేజ

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : అనంతపురంలో నిర్వహించిన 'సిద్ధం' సభకు రూట్ పర్మిట్ లేకుండా ప్రభుత్వ బస్సులు, ప్రైవేట్ బస్సులు, విద్యా సంస్థలు బస్సులు తరలించడం సరికాదని, అనేక మంది ప్రజలు బస్సులు లేకుండా శనివారం, ఆదివారం ఇబ్బందులకు గురయ్యారని టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు ప్రభు తేజ పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ శనివారం కొన్ని పాఠశాలలకు కళాశాలలకు సెలవు ప్రకటించారని, మండుటెండ నుంచి రాత్రి వరకు ఎంతో మంది విద్యార్థులు ప్రయాణికులు వేచి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏకంగా పాఠశాలల కళాశాలల బస్సులు బల వంతంగా బెదిరించి తీసుకోవడం హేయమైన చర్య అన్నారు. పాఠశాల బస్సులకు ట్రాన్స్‌పోర్టు అధికారులు ఇచ్చిన నిబంధనల ప్రకారం రోజుకు 60 నుంచి 80 కిలోమీటర్లు మాత్రమే ప్రయాణించాలని ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇచ్చింది ప్రభుత్వం. ఈరోజు ఏకంగా అనంతపూర్ జిల్లాకు సుమారు అప్ అండ్ డౌన్ 600 కిలోమీటర్లు పాఠశాల కళాశాల బస్సులను తరలించడం బస్సులు ఫిట్నెస్ దెబ్బ తింటుందన్నారు. ఈ కార్యక్రమాలకి బెదిరించి భయభ్రాంతులకు గురిచేసి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీవో ద్వారా ప్రతి కాలేజీ యజమానికి పాఠశాల యజమానులకు బెదిరించి బలవంతంగా బస్సులు తీసుకోవడం సరికాదు. టిడిపి కార్యక్రమానికి ఆర్టీసీ ప్రభుత్వ వాహనాలు ఇవ్వలేదని, ప్రయివేట్ బస్సులు కూడా ఇవ్వకుండా బెదిరించారని తెలిపారు. కానీ నేడు మొత్తం ఆర్టీసీ యంత్రాంగం ప్రైవేట్ వాహనాలు, విద్యా సంస్థల బస్సులు బలవంతంగా 600 కిలోమీటర్లు తరలించడం సరైన పద్ధతి కాదు. ప్రభుత్వ అధికారుల గుర్తుంచుకోవాలి రేపు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం వచ్చిన వెంటనే తప్పు చేసిన ప్రతి అధికారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

యువత భవిష్యత్తు టిడిపి తోనే సాధ్యం: ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలో యువత భవిష్యత్తు అభివృద్ధి చెందాలంటే టిడిపి తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. ఆదివారం రామకుప్పంలో నిర్వహించిన యువతతో ముఖాముఖిలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఎన్నికలకు ముందు ఏటా జాబ్ క్యాలెండర్ చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని యువతకు అండ గా నిలుస్తామని హామీలు ఇచ్చి, వాటిని ఏమాత్రం పట్టించుకోక యువతను మోసం చేశారన్నారు. కార్పొరేషన్ల ద్వారా యువతకు అందాల్సిన స్వయం ఉపాధి సబ్సిడీ రుణాల ఊసే లేకుండా పోయిందన్నారు. మరోసారి అధికారం కోసం అబద్ధాల హామీతో యువతను మోసం చేసేందుకు వైసిపి పెద్దలు సిద్ధపడుతున్నారని మండిపడ్డారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పన టీడీపీకే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో యువత మొత్తం టీడీపీ వైపే నిలుస్తుందన్నారు. ఇదే విషయాలను యువత గ్రామ గ్రామాన ఇంటింటా తిరిగి ప్రజలకు తెలపాలని కోరారు. కుప్పంలో చంద్రబాబు నాయుడు కు లక్ష మెజారిటీ సాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్ ,వెంకటాచలం, వెంకటేష్ , శంకర చలం,మణి,పార్థ, జ్ఞాన శేకర్,వెంకటరమణ, మంజునాథ్, సతీష్, అదిల్, విజయ్ కుమార్, బాబు సాహెబ్, మురళి, అవినాష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -సోమల

మండల కేంద్రమైన సోమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీ క్లబ్ తిరుపతి వారి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద్ ఐ హాస్పిటల్ చొరవతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ఆచార్య, మానస, గౌరీ శంకర్ వైద్య శిబిరానికి వచ్చిన వారికి కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. 129 మంది వైద్య శిబిరానికి హాజరు కాగా వీరిలో ఆపరేషన్ అవసరం అయిన 30 మందిని ఎంపిక చేసి వారిని హాస్పిటల్ ప్రత్యేక వాహనంలో శస్త్ర చికిత్సల కోసం తిరుపతికి తీసుకువెళ్లారు. ప్రతి ఒక్కరూ కంటి సంరక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవడం ఇందుకోసం బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవాలని వైద్యులు సూచించారు.

సమస్యలపై పోరాడుతాం..

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రజాసమస్యలపై పోరాడి సాధిస్తామని జనసేన వెంకటగిరి సమన్వయ కర్త గూడూరు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అంబలపూడి గ్రామంలో జనసేన మండల అధ్యక్షుడు పగడాల వెంకట రమణ ఆధ్వర్యంలో పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు.